# ప్రార్థన

- పి.ఎస్. నారాయణ



చెట్టు మీద పిట్టలన్నీ ఒక్కసారిగా రెక్కలు టపటపలాడిస్తూ లేచినట్లుగా ఆంజనేయ స్వామి గుడి ముందు గట్టుమీద కూర్చున్న నలుగురూ ఘొల్లున నవ్వారు.

జోకేసిన చిదంబరం అయితే పొట్టపట్టుకొని ఇంకా నవ్వుతూనే వున్నాడు.

ఆరోజు గుళ్లో అంతగా జనం లేరు.

పెద్ద ఆవరణలో చిన్న గుడి. తూర్పువేపుగా వున్న విశాలమైన రావిచెట్టు మొదట్లో గట్టు..... గుడికి చుట్టూ సిమెంటు రాళ్ళతో ప్రహరీగోడ... మధ్యలో పూలమొక్కలు...

వాళ్ళందరూ వివిధ ఆఫీసుల్లో పనిచేస్తున్నారు. ఒకే వయస్సులో వున్నవాళ్ళు. ఆఫీసులనుంచి వచ్చిన తరువాత స్నానాలుచేసి గుళ్ళోకి వచ్చి ఆంజనేయస్వామికి దణ్ణం పెట్టుకొని ఆ గట్టుమీద పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ గంటసేపు కూర్చొని ఇంటికి వెళ్ళటం అలవాటు.

వాళ్ళు అలాకూర్చున్న పావుగంటకు రంభ వచ్చి ప్రదక్షిణలు చేయటం మొదలు పెట్టింది. ఆ వీధికి రెండు వీధుల అవతల ఓ డాబా యింట్లో వుంటుంది ఆమె. రంభ పేరుకు తగ్గట్లు రంభే. వయస్సు యిరవై ముప్ఫయి మధ్యలో వుండి మంచి పరువంతో ఎర్రగా, పొడుగ్గా వుంటుంది. వెడల్పైన మొఖం, పెద్ద పెద్ద కళ్లు. పొడవైన జడ... ఒకసారి చూసిన ఏ వయస్సులో వాడైనా పదే పదే చూడాలని తహతహలాడేటంత అందం ఆమెది.

మొగవాళ్ళంతా ఆమె అంటే పడిచస్తుంటారు గనుక ఆమె తన శక్తి మేరా వాళ్ళకోరికల్ని తన సాంగత్యంతో తీరుస్తుంటుంది. ఏ ఊరి పిల్లో తెలియదు గాని ఆ వీధిలోకి వచ్చిన రెండేళ్ళకే ఆ వీధంతా ఆ ఊరంతటికే తెలిసిపోయేటంత పేరు తెచ్చింది.

రంభ ఆ వీధిలోకి చేరిన ఆరునెల్లదాకా చిదంబరం ఆ పక్కింట్లోనే వుండడంతో కాస్త మాట పరిచయం ఏర్పడింది. రంభ యింటికి జనం రాకపోకలు ఎక్కువవ్వడంతో తన భర్త ఏదో పోగొట్టుకున్నవాడిలా ఎపుడూ ఆ యింటి వంకే చూస్తూ వుండటంతో చిదంబరం భార్య భర్తతో పోరాడి ఇల్లు మారింది.

ఆ రోజు సాయంత్రం ఆ నలుగురు మిత్రుల నడుమ చిదంబరం ఓ ప్రశ్నను తూటాలా పేల్చాడు. "రంభ రోజూ ఈ మధ్య దేవాలయానికి వస్తున్నది గదా... ఏంవని దేంవుణ్ణి ప్రార్థిస్తుంది? ఏ కోరికలతో ఈ ప్రదక్షిణాలు చేస్తున్నదీ?" అంటూ

ఒకతను అన్నాడు. "మరో జన్మ ఇలాంటిది ఇవ్వద్దు అని అడుగుతున్నదేమో?"

చిదంబరం ఒప్పుకోనట్లుగా తల అడ్డంగా ఊపాడు. "ఇంకా డబ్బున్న వాళ్ళు, తన దగ్గరకు, ఇంకా .ఇంకా రావాలని కోరుకోవచ్చు గదా!" అన్నాడు ఎగతాళిగా.

అందుకే అందరూ ఒక్కసారిగా అంతపెద్దగా నవ్వింది. "నిజమే... నిజమే!" అన్నట్లుగా.

"మనం ఉద్యోగాలు చేసుకుంటున్నాం.. మనం ఏమని దణ్ణం పెట్టుకుంటాం.. మన వృత్తిలో మనం పైపైకి వెళ్ళాలని... మనకింకా ఎక్కువ జీతం రావాలని.. అలాగే అదీను!" చిదంబరం తన మాటలకు బలంగా ఉదాహరణలు గూడా జోడించాడు.

"అవునులేండి... లేకపోతే పాపాలపుట్టకు దేఁవుడితో పనేఁటి?... మనం కాశీ మజిలీ కథల్లో చదవలా.. బందిపోటు దొంగలు గూడా దోపిడీలకు వెళుతూ గుళ్ళోకి వెళ్ళి దణ్ణం పెట్టుకుంటారు. దొరికిందాంట్లో భాగం గూడా ఇస్తామంటూ!" దీర్ఘం తీస్తూ ఆనందరావు అన్నాడు.

చిదంబరంకు అతడి ఒత్తాసుతో ఊపెక్కింది. రంభను పలకరించి కూడా చాలా రోజులయింది. ఆమె ఇంటి పక్క ఇంట్లో వున్నప్పుడు ఏదో వంకన వలకరిస్తుండేవాడు.. పెళ్ళామేమో 'ఆఛందాలాన్నంతా' తన కళ్ళతో చూళ్ళేను అంటూ తన ప్రాణం తీసి ఇల్లు మార్చింది. అప్పటినుంచి తను రంభతో ఒక్కముక్కయినా మాట్లాడింది లేదు!

"అడగనా వెళ్ళి?" అన్నాడు హుషారుగా.

"నీకు తెలుసేమిటి?"

"దాని బాగోతం నాకెందుకు తెలియదు.. ఆరు నెలలు యిద్దరం పక్క పక్క ఇళ్ళలోనే వున్నాం కదా!"

ఈర్ష్యగా మిగతా ముగ్గురూ అతడివంక చూచారు.

"మరి చెప్పవూ.. కానీయ్!" అన్నాడు ఆనందరావు. " మాకు పరిచయం చేయి... అప్పుడప్పుడూ మేమూ మాట్లాడుతుంటాం అదనీ ఇదనీ..." అంటూ ఎగదోశాడు.

హుషారుగా లేచాడు చిదంబరం.

గుళ్ళో నుంచి బయట కాలుపెట్టింది రంభ. ఇంకొక్క నిముషం ఆలస్యమయితే అక్కడంతా చీకటే అవుతున్నంత ఆదుర్దాగా చిదంబరం ఆమెవైపుకు అడుగులు వేసి, ఆమె తన వంక చూడగానే, మొఖాన్ని చాటంత చేసుకొని, "బాగున్నావా?" అన్నాడు.

రంభ చిరునవ్వు నవ్వింది.

"అవునూ - పతివ్రతగారూ! ఈ మధ్య రోజూ గుడికి వస్తున్నారు కదా.. దేఁవుణ్ణి ఏమని కోరుకుంటున్నారు?" అన్నాడు నోరంతా తెరిచి ఆమెనే చూస్తూ.

" నాకేం కోరికలుంటయ్యండీ ప్రత్యేకంగా... మహా పతివ్రత అయిన మీ భార్య నాకు పోటీగా రాకుండా వుండాలని దణ్ణం పెట్టుకుంటాను.- అంతే!" అంటూ వడివడిగా ఆ ఆవరణ దాటింది రంభ.

❑

---

# జీవితం



వెలుగునీడలు
సుఖదుఃఖాలు
రంగుల వల
దాగుడుమూతలు
ఆశనిరాశలు
చదరంగము
జీవితంలో
తప్పవు మరి.

– ఎద్దుల శంకరనారాయణ.